
# అవరోహణ

మూలకథ: తరుణ్ కాంతి మిశ్రా
అనువాదం: ఆర్.శాంతసుందరి



**రైలు నెమ్మదిగా బైలుదేరింది. విరూపాక్ష తన సీటులో వెనక్కి జారగిలబడి కూర్చుని, బ్యాగులోంచి వార్తాపత్రిక తీసుకుని చదవసాగాడు.**

రైలు కదలటం వల్ల కిటికీలోనించి కొద్దిగా గాలి లోపలికి రాసాగింది. ప్లాట్‌ఫారమ్ మీద గుంపూ, పెట్టెలో గాలి ఆడనందువల్ల ఉన్న ఉక్కపోతా సుమతిని బాగా నీరసపెట్టాయి. అందుచేత లోపలికి గాలితెర రాగానే ఆమెకి ప్రాణం లేచివచ్చింది.

రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంట్ అవటం చేత లోపల జనసమ్మర్దం లేదు గాని, ప్రయాణీకులు మాత్రం చాలామందే ఉన్నారు. వాళ్ళ దగ్గర సామాన్లు కూడా ఎక్కువగానే ఉన్నాయి.

ఐదునిమిషాలపాటు వార్తపత్రిక చదివాక, విరూపాక్ష ఉన్నట్టుండి లేచి నిలబడ్డాడు. ఒంగి తన సామాను చూసుకుంటూ ఎందుకో గాభరాపడుతూ,

''అరే! ఆ నల్లరంగు సూట్‌కేస్ మనతోనే ఉండాలి కదా?'' అన్నాడు.

నల్ల సూట్‌కేసు అక్కడే ఉంది. దాన్తోపాటే ఎర్ర సూట్‌కేసూ, ట్రంకు పెట్టే, రెండు హ్యాండ్‌బాగ్‌లూ, నీళ్ల బాటిలూ, తిండివస్తువులున్న సంచీ, సుమతి పర్సూ, అన్నీ ఉండవలసిన చోటే ఉన్నాయి.

ఇంటినించి బైలుదేరేటప్పుడే విరూపాక్ష ఒక్కొక్క సామానూ లెక్కపెట్టి మరీ రిక్షాలోకి ఎక్కించాడు. ప్లాట్‌ఫారమ్ మీద కూడా అన్నీ ఒకచోట పెట్టించి, జాగ్రత్తగా బోగీలోకి ఎక్కించాడు. ఒక్క వస్తువు కూడా పోలేదు. విరగలేదు.

సామానంతా సరిగ్గానే ఉందని తెలిశాక, అతను మళ్లీ కూర్చుని వార్తాపత్రిక చదవటం మొదలుపెట్టాడు.

సుమతి కిటికీలోంచి బైటికి చూడసాగింది. రైలు ఒక వంతెన మీది నుంచి వెళ్తోంది. కిందికి తొంగి చూస్తే ఆ ప్రవాహానికి అంతెక్కడో తెలీదనిపించేలా ఉంది.

ప్రస్తుతం వీచే గాలిలో చెమ్మ బాగా ఉంది.

విరూపాక్ష తను చదువుతున్న పేపరు మీంచి చూపులు మళ్లించి,

"వెధవన్నర వెధవలు.. ఈ ప్రభుత్వం ఇంకెన్నో రోజులుండదు.!" అన్నాడు.

ఆ తరువాత ఆ మధ్యపేజీలో ఉన్న వార్తని పైకి చదివి పెళ్లానికి వినిపించసాగాడు. దాని సారాంశమేమిటంటే, ముఖ్యమంత్రి కొడుక్కీ, ఆర్థిక మంత్రి అల్లుడికీ మధ్యన చాలాకాలంగా సాగుతున్న ప్రచ్ఛన్న యుద్ధం ఇప్పుడు క్రమక్రమంగా ఎక్కువ కాజొచ్చింది. ప్రస్తుతం పరిస్థితి ఎలా ఉందంటే, ఈ ప్రభుత్వం భవిష్యత్తుని ప్రొహిబిషన్ మంత్రి చేతిలో పెట్టడంతో వాడు ఎవరి పక్షం వహిస్తాడో స్పష్టంగా తెలీదు.

సుమతి మారుమాట్లాడకుండా అతను చదివిన వార్త వింది. ఎదురు బెర్త్ మీద పడుకున్న అరవాయన ఒకసారి కళ్లు తెరిచి విరూపాక్ష కేసి చేసి, మళ్లీ కళ్లు మూసుకుని నిద్రపోవటానికి ప్రయత్నించసాగాడు.

విరూపాక్ష మళ్లీ పేపరు చదవటంలో మునిగిపోయాడు.

సుమతి బాత్రూంకెళ్లాలి, కానీ అక్కడి కంపు గుర్తుకురాగానే, ఇప్పుడే వద్దులే, అనుకుంది.

భద్రక్ నించి రాజ్‌గంగాపూర్‌కి ఎనిమిది గంటల ప్రయాణం. మరీ అవసరమొస్తే, ఒక్కసారి వెళ్తాలే, అనుకుంది. అలాగని అసలు ఇంట్లో బైలుదేరక ముందే నిశ్చయించుకుంది. అందుకే ఆమె నీళ్లు కూడా తక్కువగానే తాగింది.

"నీళ్ల బాటిలేది? ఒకసారిలా ఇయ్యి. కొద్దిగా తాగుతాను.!" అన్నాడు విరూపాక్ష.

నీళ్ల బాటిలు తీసుకుని, అతను గటగటా పొట్ట నిండా నీళ్లు తాగాడు. నీళ్లు తాగేప్పుడు, అతని గొంతులోని ముడి ఏదో పురాతనకాలపు జంతువుకిలాగ పైకీ కిందికీ కదలసాగింది. సుమతికి అది చూస్తే అసహ్యం వేసింది.

సుమతి తల అడ్డంగా ఆడించింది. విరూపాక్ష బాటిల్ని సీటుమీద పెట్టాడు.

పొద్దున్న స్టేషన్‌కి చేరుకున్నాక, విరూపాక్ష రిక్షావాడితో చాలాసేపు పోట్లాడాడు. రిక్షావాడు ముందు ఒప్పుకున్న దానికన్నా మూడురూపాయలెక్కువ అడిగాడు- సామాను మరీ ఎక్కువని వాదించాడు. కానీ మాట్లాడినదాని కన్నా పైన ఒక్కపైసా కూడా ఇవ్వనని విరూపాక్ష భీష్మించుకున్నాడు. కానీ రైలొచ్చే సమయం కావటంచేత, అతను రెండు రూపాయలెక్కువ ఇవ్వవలసి వచ్చింది. కానీ రిక్షావాడు అటుపోగానే విరూపాక్ష నోటివెంట వచ్చిన అసభ్యకరమైన తిట్లు విని సుమతి భరించలేకపోయింది.

విరూపాక్ష నోటివెంట అప్పుడప్పుడూ అలాంటి తిట్లు రావటం ఆమెకి అలవాటే. రెండురోజుల క్రితం దోమతెరలోకి దూరిన ఒక దోమని చంపలేకపోవటంతో ఇలాంటి భయంకరమైన తిట్టే అతని నోటి వెంట వచ్చింది. ఆరోజు తిట్టు తనకే తగిలినంతగా బాధపడింది సుమతి. లేకపోతే మూడువారాల క్రితం పెళ్లిచేసుకుని ఇంటికి తీసుకొచ్చిన కొత్తపెళ్లాం ముందర, ఏ మగాడైనా అలాటి ఛండాలపు భాష వాడతాడా?

మూడు వారాలు, అంటే ఇరవై ఒక్క రోజులు. కానీ ఈ మూడు వారాలూ సుమతికి మూడు యుగాల్లా అనిపించాయి...."ఏమిటీ ప్రయాణం, ఎంతకీ ఎడతెగకుండా! అది చాలక ఈ రైలొకటి గంటంబావు లేటు కూడాను, అంటే రాజ్‌గంగాపూర్ చేరేసరికి ఏడవుతుంది!" అన్నాడు విరూపాక్ష చేతిగడియారంకేసి చూసుకుంటూ కొంత తనలో తను అనుకుంటున్నట్టూ, కొంత సుమతితో అంటున్నట్టూ. తరవాత పైన సరిగ్గా తిరగని ఫానుకేసి చూస్తూ ఆవలించాడు.

చేతికి కట్టుకున్న గడియారం విరూపాక్షకి కొంచెంకూడా నచ్చలేదు. అతనికి టైమెక్స్ వాచీ, గోల్డు చైనున్నది, పెట్టుకోవాలని కోరిక. కానీ అతనికి హెచ్.ఎమ్.టీ వాళ్ల మామూలు గడియారమే ఇచ్చారు. టీవీసెట్, ఉంగరం, సూటుగుడ్డ, ఏదీ అతను కోరుకున్నది దొరకలేదు. ఆ విషయం అతను నోరు తెరిచి చెప్పలేదు గాని, అతని ముఖ కవళికల్ని చూసి సుమతి అర్థం చేసుకుంది.

విరూపాక్ష నోటివెంట అప్పుడప్పుడూ అలాంటి తిట్లు రావటం ఆమెకి అలవాటే. రెండురోజుల క్రితం దోమతెరలోకి దూరిన ఒక దోమని చంపలేకపోవటంతో ఇలాంటి భయంకరమైన తిట్టే అతని నోటి వెంట వచ్చింది. ఆరోజు తిట్టు తనకే తగిలినంతగా బాధపడింది సుమతి. లేకపోతే మూడువారాల క్రితం పెళ్లిచేసుకుని ఇంటికి తీసుకొచ్చిన కొత్తపెళ్లాం ముందర, ఏ మగాడైనా అలాటి ఛండాలపు భాష వాడతాడా?

ఉన్నట్టుండి కంపార్ట్‌మెంట్ అటు చివరినుంచి ఎవరో గట్టిగా భజనలు పాడసాగారు.

గొంతు మృదువుగా ఉంది కాని సాఫీగా పాడలేకపోతున్నట్టుగా ఉంది. ఓ పన్నెండు- పదమూడేళ్ల కుర్రాడు భక్తి గీతాలు పాడుకుంటూ బిచ్చమెత్తుకుంటున్నట్టున్నాడు.

"అబ్బ, అందరికీ గొడవ చెయ్యటానికి ఈ రిజర్వ్‌డ్ కంపార్ట్‌మెంటే కావాల్సి వచ్చినట్టుందే!"

ఎవరో ప్రయాణీకుడు అరిచాడు.

ఎదురు బెర్తుమీద పడుకున్న అరవాయన విసుక్కుని అటుతిరిగి పడుకున్నాడు. బిచ్చగాడి పాటకన్నా ఆ ప్రయాణీకుడు పెట్టిన కేక వల్ల అతనికి ఇబ్బంది కలిగినట్టుంది.

విరూపాక్ష పేపరు మీదినించి దృష్టి మళ్లించి మొత్తం బోగీనంతా కలియజూశాడు. తరవాత కిటికీలోంచి బైటికి చూడసాగాడు.

బైట పెద్దగా చూడవలసిన దృశ్యాలేవీ లేవు. దుమ్మునిండిన ఆకాశం కింద ఎప్పుడూ కనిపించే నేల మీద అవే దృశ్యాలు, వింతలూ విశేషాలూ ఏవీ లేవు.

ఒళ్లు విరుచుకుంటూ విరూపాక్ష లేచి నిలబడ్డాడు. అతను టాయ్‌లెట్‌కి వెళ్లబోతున్నాడని సుమతి గ్రహించింది.

పాటపాడుతూ ఆ కుర్రవాడు వీళ్లకేసే రాసాగాడు.

చిక్కి శల్యమైన ఆకారాన్ని చూసి వాడి వయసెంతో ఊహించటం కష్టమే! చిరిగిపోయిన నిక్కరూ, పాత షర్టూ వాడి శరీరాన్ని పూర్తిగా దాచలేకుండా ఉన్నాయి. వాడు తడుముకుంటూ నడవటం చూసి, గుడ్డివాడని సుమతి వెంటనే గ్రహించింది.

వస్తున్నప్పుడు వాడి తల ఒకసారి బెర్తు కొసకి కొట్టుకుంది. ఇంకోసారి ఒక పెట్టె కాలికి తగిలింది. ఆ తరవాత ఒక లావాటి మనిషి అడ్డొచ్చేసరికి, అతన్ని ఢీకొట్టుకుని, వాడు సుమతి కూర్చున్న సీటు పక్కకి ఒరిగిపోయాడు.

సుమతికి చాలా దగ్గరగా నిలబడి, కిందపడిపోకుండా నిలదొక్కుకుంటూ, వాడు మళ్లీ ఒక పాట అందుకున్నాడు.

కొంతసేపు పాడాక సుమతి వైపు తిరిగి, "అమ్మా! ఈ పేదవాడికి దయతలిచి పైసలివ్వండమ్మా!" అన్నాడు.

వాడిచేతిలో నిర్దయ మిగిల్చిన నిరాశకి చిహ్నంగా ఓ రెండు మూడు అర్ధరూపాయల బిళ్లలు ఉన్నాయి.

కంపార్టుమెంటులో ఎంతోమంది ఉన్నారు కానీ ఎవరూ ఈ కుర్రవాణ్ణి పట్టించుకోవటం లేదు. కొందరు పై బెర్తుమీదకెక్కి కాళ్లు బారజాపుకుని పడుకుని నిద్రపోతున్నారు, కొందరు తోటి ప్రయాణీకుల్తో బాతాఖానీ వేసుకున్నారు. ఇంకొందరు ఏదో ఆలోచిస్తూ కిటికీలోంచి బైటికి చూస్తున్నారు.

సుమతి ఆ కుర్రాడితో గుసగుసలాడుతున్న స్వరంలో అంది. "నిజం చెప్పు! నువ్వు గుడ్డివాడివైతే నేను ఆడదాన్నని నీకెలా తెలిసింది?"

వాడికి ఆమె అడిగిన ప్రశ్న సరిగ్గా వినిపించిందో లేదో, కానీ ఇంతలో విరూపాక్ష రుమాలుతో మొహం తుడుచుకుంటూ బాత్రూంలోంచి బైటికొచ్చాడు సుమతికి అంత దగ్గరగా నిలబడి ఉండటం చూసి, "ఒరే వెధవా! పో ఇక్కణ్ణించి!" అని కసిరాడు.

కుర్రవాడు మాట్లాడకుండా అక్కణ్ణించి కదిలాడు.

ఇంతవరకూ ఆగకుండా పరిగెత్తుతున్న రైలు ఉన్నట్టుండి పొలికేక పెట్టినట్టుగా గట్టిగా కూసింది.

విరూపాక్ష వాచీ చూసి, "బాలేశ్వర్ వచ్చేసింది. ఇక్కడ రైలు ఏడు నిమిషాలు ఆగుతుంది." అన్నాడు.

ఇప్పటివరకూ ప్రశాంతంగా పసిపిల్లల్లా నిద్రాదేవి ఒడిలో ఉన్న కొంతమంది, కదలసాగారు. ఇంకొంతమంది తమ సామాన్లు సిద్ధంగా తీసిపెట్టుకుని, ఆత్రుతగా బైటికి చూడసాగారు.

దెబ్బతిన్న కొండచిలువలా నిట్టూర్పులు విడుస్తూ, చివరికి రైలుప్లాట్‌ఫారమ్ మీదికి చేరుకుని ఆగింది. కొంతమంది ఏదో కొంప మునిగిపోతున్నట్టు చాలా హడావిడిగా దిగసాగారు. ప్లాట్‌ఫారమ్ మీద ఒకటే గోల. జన సందోహం తొక్కిసలాట.

విరూపాక్ష లేచి నిలబడి బైటికి చూస్తూ, "సిగరెట్ పాకెట్ కొనుక్కోవటానికి వెళ్తున్నాను. నీకోసం పెప్సీ తీసుకురానా?" అన్నాడు.

సుమతి తల అడ్డంగా ఆడించింది.

స్టేషన్‌లో ఉన్న గుంపులో కలిసి మాయమయ్యే దాక, ఆమె విరూపాక్షకేసి చూసింది. అతని నడకలో ఏదో ఒక ప్రత్యేకత ఉంది. దానివల్లే ఎంతోమంది మధ్యన ఉన్నా అతన్ని గుర్తించటం సులువు. ఆ నడకలో తన చుట్టూ ఉన్న ప్రపంచం మీద తనకున్నా ఏదో ఒకరకమైన నిర్లక్ష్యం కనబడుతూ ఉంటుంది. తన గురించి కూడా గొప్ప అభిప్రాయం ఉన్నట్టు కనబడదు. ఈ ప్రపంచం ఉంటేనేం లేకపోతేనేం? ఈ భూమ్మీద నేనుంటేనేం లేకపోతేనేం? అన్న భావం కనిపిస్తూ ఉంటుంది.

విరూపాక్ష వెళ్లగానే ఆ గుడ్డి కుర్రాడు మళ్లీ సుమతి దగ్గరకొచ్చాడు.

"ఒక్క రూపాయి ఇవ్వండమ్మా! భగవంతుడు మీకు మేలు చేస్తాడమ్మా!"

''నువ్వు గుడ్డివాడివి కావు!'' అంది ఆమె.

తన చుట్టూ అంధకారాన్ని నింపుకున్న ఆ కుర్రాడు బిత్తరపోయాడు. వాడు ఆమె అలా అంటుందని అనుకోలేదు. ''నువ్వు గుడ్డివాడివైతే నేను ఆడదాన్నని నీకెలా తెలిసిందిరా?'' అంది ఆమె మళ్లీ.

వాడు వింతగా నవ్వసాగాడు. వాడి పళ్లు గార పట్టి ఉన్నాయి. నవ్వుని ఆపుకుంటూ, ''మీరు మరీ చెబుతారమ్మా! మనిషి శరీరానికి వాసన ఉండదా? అందులోనూ ఆడవాళ్ల శరీరాలకి ప్రత్యేకమైన ఒక సువాసన ఉంటుందమ్మా:'' అన్నాడు వాడు.

''ఒరే..కుర్రవెధవా.. అడ్డంలేపో ఇక్కణ్ణించి..'' ఆ లావుపాటి వ్యక్తి అన్నాడు. అతని రెండు చేతుల్లోనూ తినుబండారాల దొన్నెలున్నాయి. అతను వాణ్ణి గట్టిగా కసరసాగాడు.

అతని వెనకే ఇంకో ఇద్దరు కొత్తగా ఎక్కిన ప్రయాణీకులు ఉన్నారు. రైల్లో రద్దీ చూసి వాళ్లు విసుక్కుంటున్నారు.

గుడ్డివాడు అక్కణ్ణించి కదిలి గుంపులో కలిసిపోయాడు.

ఆడవాళ్ల శరీరాలకు సువాసన ఉంటుందని వాడన్నమాట నిజమేనా? నిజమైతే విరూపాక్ష ఎప్పుడూ ఆ సంగతి తనతో అనలేదే? ఇరవై ఒక్క రోజులు ఇరవై ఒక్క రాత్రులు నాతో గడిపాక కూడా ఎన్నడూ సంభ్రమంతో, ఆర్తితో నన్ను తాకలేదే! నన్నెప్పుడూ ఒక వస్తువులాగే చూశాడే! పళ్లు తోముకునే బ్రష్‌లాంటి అవసరమైన వస్తువు తను అంతే! పొద్దున్న బ్రష్ చేసి పెట్టేశాక ఇక రోజంతా అది జ్ఞాపకం కూడా రాదు.

ఇటువంటి మనిషి శరీరం కింద ప్రతిరాత్రీ నలిగిపోతూ, జీవితమంతా అతనితోటే గడపటంలో ఏం సుఖం ఉంటుంది? ఇరవై ఒక్కరోజుల క్రితం అతను తనకు పూర్తిగా అపరిచితుడు. ఇప్పటికీ అపరిచితుడే! ఎన్నడూ చూడని రాజ్‌గంగాపూర్ అనే ఒక ఊళ్లో, ఒక సందులో ఉన్న ఇరుకు అద్దె ఇంట్లో ఇరవైనాలుగ్గంటలూ తను బందీగా ఉంటోంది.

జీవితం ఇంత తుచ్ఛంగా, ఇంత నిస్సారంగా ఉంటుందా?

ఆమె ఆలోచనలకి అంతరాయం కలిగిస్తూ రైలు కదిలింది. ఏడు నిమిషాలు పూర్తవగానే, ఇష్టం లేనట్టుగా, ఇంక వేరే మార్గం లేనట్టు రైలు భారంగా ముందుకి సాగింది.

రైలు కదలగానే అలసట తీర్చుకుంటూ ప్లాట్‌ఫారమ్ మీద నిలబడిన ప్రయాణీకులు ఒకర్నొకరు తోసుకుంటూ గబగబా రైల్లోకి ఎక్కసాగారు.

అందరూ ఎక్కారు కాని విరూపాక్ష కనిపించలేదు.

రైలు క్రమంగా వేగం పుంజుకోసాగింది. కిటికీ బైట ప్లాట్‌ఫారమ్ మీదున్న జనం, ఒక చేదు జ్ఞాపకంలా, చెదురుమదురు కాసాగారు.

విరూపాక్ష కంపార్టుమెంట్లోకి ఎక్కే ఉంటాడు. ఇంకొద్ది నిమిషాల్లో వచ్చేస్తాడు. లేకపోతే ఇంకో కంపార్టుమెంటులోకి ఎక్కి ఉండవచ్చు. అలా అనుకుని సుమతి గాభరాపడకుండా ఊరుకుంది. ఆమె మొహంలో కంగారు ఎంతమాత్రం కనిపించలేదు.

రైలు బాగా వేగంగాపోసాగింది. అంతలోనే ఆ వేగం తగ్గి, సడన్ బ్రేక్ వేసినట్టు చక్రాలు కీచుమన్నాయి. కుదుపులతో రైలు ఆగింది.

''ఏమయింది? రైలెందుకు ఆగింది?''

ప్రయాణీకులు ఒకర్నొకరు అడిగారు. కానీ ఈ ప్రశ్నకి జవాబు ఎవరికీ తెలీలేదు.


రైలు ప్లాట్‌ఫారమ్‌ని వదిలి కొంతదూరం వచ్చేసింది. ఎదురుగా సిగ్నల్ స్తంభం కనిపిస్తోంది. రైలు కట్ట పక్కనే పూరి గుడిసెలూ, పొలాలూ, మురిగ్గా ఉన్న చెరువు నీళ్లలో పూసిన కలవపూలు.

రైలు ఇక్కడిదాకా వచ్చి ఎందుకు ఆగిందో?

సంగతేమిటో తెలుసుకోవాలనుకున్న ఆసక్తితో కొందరు రైలు దిగారు. ఇటూ అటూ చూడసాగారు.

ఒక అతను పరిగెత్తుకుంటూ వచ్చి, ''రైలు కింద ఎవరోపడ్డారు. ప్రాణం పోయినట్టుంది.'' అన్నాడు.

''రైలు కిందా? అదెలా?''




ఇక ఒకటొకటిగా వివరాలు తెలియసాగాయి. ముందుగా ఎవరో వచ్చి, ''పోయినది ఆడమనిషి. రైలు దిగుతూండగా కాలు తడబడి పడిపోయిందిట. ఆమె శరీరం రెండుముక్కలయింది.'' అన్నాడు. తరవాత ఇంకొక వ్యక్తి వచ్చి, ''పోయినది ఆడది కాదు మగాడు.'' అన్నాడు.

చూడటానికెలా ఉన్నాడు. వయసెంతుంటుంది, డాక్టర్ వచ్చాడా లేదా, పోలీసులేమయారు? ఇలాంటి ప్రశ్నలు అందరూ ఆడగసాగారు.

ఈ ప్రశ్నలూ, జవాబులూ అన్నీ అయాక తేలినదేమిటంటే, దాదాపు పాతిక ముప్ఫై ఏళ్లున్న ఒక యువకుడు రైలుకిందపడి చితికి పోయాడనీ, అతను తెల్లరంగు బుష్ షర్టు, బ్రౌన్ రంగు పాంటూ వేసుకుని ఉన్నాడనీ, అతని చేతిలో ఉన్న సిగరెట్టు ఇంకా వెలుగుతూనే ఉందనీ.

తెల్ల షర్టూ, బ్రౌను పాంటూ, చేతిలో సిగరెట్టూ!

సుమతి కూడా ఈ వివరాలు వింది. ఆమె కళ్ల ముందు విరూపాక్ష రూపం నిలిచింది. అదే వయసు, అవే బట్టలు, చేతిలో సిగరెట్టు కూడానూ!

కానీ ఆశ్చర్యం ఏమిటంటే సుమతి గుండె వేగంగా కొట్టుకోలేదు. కళ్లల్లో కూడా ఎటువంటి భావమూ లేదు, నిశ్చలంగా ఉన్నాయి. నోరు విప్పలేదు. ఏమీ జరగనట్టే మామూలుగా ఉంది.

విరూపాక్ష అనే పేరుగల ఒక యువకుడికీ తనకీ ఏం సంబంధం? అతను తనకి దగ్గర మనిషా? పోయిన నెలవరకూ అతను తనకి పూర్తిగా అపరిచితుడు. ఇవాళ అతను లేడు. అంతమాత్రాన ఏం కొంపమునిగిపోయింది? అతను లేకపోతే తను మునుపటి సుమతి లాగ బతకలేదా? తనకు ఇరవై ఒకటి నిండే వరకూ మరి తను అలాగే బతికింది కదా?

సుమతి గుండెని ఎంత గీకి చూసినా అక్కడ ఆ మనిషి మీద ప్రేమగానీ, గౌరవంగానీ కనిపించవు. ఐనా అతని మనసులో మటుకు ఆమె మీద ప్రేమానురాగాలు ఉన్నాయి కనకనా! 'ప్రేమ' అనే అందమైన మాట గురించి అతనికేమాత్రం తెలుసు!

పరవాలేదు. తనకి ఎలా రాసిపెట్టి ఉందో అలాగే జరుగుతుంది. ఇప్పుడిక తను రాజ్‌గంగాపూర్‌కి వెళ్లదు. భద్రక్‌కి తిరుగుప్రయాణమై అక్కణ్ణించి బిచార్‌పుర్‌లో ఉన్న తన పుట్టింటికి వెళ్లిపోతుంది. ఆ పాత మొహాల మధ్యకి, పరిచితమైన పగళ్లూ రాత్రులూ అనుభవించటానికి.

తనచుట్టూ గుంపుగా ఉన్న జనంలోని ఆవేశాన్నీ, ఆత్రుతనీ మర్చిపోవటానికి ప్రయత్నిస్తూ ఆమె కళ్లు మూసుకుని, తల సీటుకి ఆనించి కూర్చుంది.

ఎంతసేపలా కూర్చుండిపోయిందో ఆమెకే తెలీలేదు. రైలు నెమ్మదిగా బైలుదేరింది. బోగీలో ఉన్న ప్రయాణీకులు తమ జాగాల్లోకెళ్లి కూర్చున్నారు.

వాళ్లు చూసిన దృశ్యం ఎంత భయంకరంగా ఉందో, అది చూసిన వాళ్ల కళ్లు భయంతో వాటంతట అవే మూసుకుపోతున్నాయి.

సుమతికి తనకి చాలా దగ్గరగా ఒక గొంతు వినిపించింది. తనకి చాలా పరిచితమైన గొంతు. అయినా ఆమె కళ్లు తెరవలేదు.

''వాడే, ఆ బిచ్చమెత్తుకునే కుర్రాడు. నిన్ను పైసలిమ్మని పీడించాడే, వాడు. వాడు నిజంగా గుడ్డివాడే. రైలు బైలుదేరిందనైనా ఆలోచించకుండా కిందికి దూకేశాడు. ప్లాట్‌ఫారమ్ దాటిపోవటంతో చక్రం కిందపడ్డాడు. పాపం. వాడికి అంత భయంకరమైన చావు రాసిపెట్టుంది...''

విరూపాక్ష ఆమె పక్కనే చతికిలపడ్డాడు. అతని నోట్లోంచి వస్తున్న సిగరెట్ వాసన హాలాహలంలా సుమతి నవనాడుల్లోకీ ప్రవహించసాగింది.

ఉన్నట్టుండి వచ్చిన ఉప్పెనలాగ, సుమతి గుండెలు ఎగసి ఎగసిపడి కళ్ళల్లో కన్నీళ్లు ఉబికాయి. ఏ దుఃఖం చేతో, లేక ఆనందం చేతో, ఆమె మూర్ఛపోయింది. కారణం ఎవరికీ తెలీదు... తరువాత ఆమె భోరుమని ఏడుస్తూ తన గుండెల్లో కరుడుకట్టిన దుఃఖాన్ని కరిగించుకుంటూ విరూపాక్ష భుజాల మీదికి ఒరిగిపోయింది.

విరూపాక్ష ఒక చెయ్యి సుమతి వీపుమీద ఉంది. రెండో చేతిలో కాలుతున్న ఫిల్టర్ సిగరెట్టుంది. ★